ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (పోడూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 24-10-96)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

నీ దేహంలో ఏదైనా రోగం ఉంది అనుకో నీకు ఆరోగ్యం ఎలా వస్తుంది. రోగం ఉండగా ఆరోగ్యాన్ని ఆశించటానికి అవకాశం లేదు. రోగం తగ్గితేనేగాని నీకు ఆరోగ్యం చేకూరదు. అదేవిధంగా నీ మనస్సులో దోషములు ఉన్నప్పుడు, బలహీనతలు ఉన్నప్పుడు నీవు మానసిక ఆరోగ్యంను ఆశించటానికి అవకాశం లేదు. మనస్సులో చాపల్యం ఉన్నంతకాలం మానసికఆరోగ్యం చేకూరదు. శారీరక ఆరోగ్యంకంటే మానసిక ఆరోగ్యం చేకూర్చుకోవటం చాలాకష్టం. మనస్సులో ఉన్న దోషాలను తొలగించుకోవటం చాలాకష్టం కదాఅని అర్జునుడు కృష్ణుడిని అడిగితే నీవు చెప్పినది నిజమే కాని అభ్యాసం, వైరాగ్యంలవలన మనస్సును స్వాధీనం చేసుకోవచ్చు అని కృష్ణుడు గీతలో చెప్పాడు. స్వాధీనమైన మనస్సు నీకు సుఖాన్ని, శాంతిని కలుగజేస్తుంది. వైరాగ్యం, అభ్యాసం లేనివాడికి జ్ఞానం కలుగదు. ఎవడికైతే జ్ఞానం కలిగిందో వాడికి ఇంద్రియ సుఖాలమీద, భోగాలమీద అపేక్ష కలుగదు. డాక్టరు రోగాన్ని తగ్గించటానికి సహాయం చేస్తాడు. డాక్టరు మందులు ఇస్తాడు. ఇచ్చిన మందులు నువ్వే మింగాలి. డాక్టరు మింగడు. అదేవిధంగా గురువు మనస్సును స్వాధీనంచేసుకోవటానికి మార్గాన్ని నిర్దేశిస్తాడు. ఆ మార్గంలో నడవవలసింది నువ్వే. నీ నెత్తిమీద బరువుఉంటే ఎవరైనా వచ్చి దించవచ్చునుకాని నీ అజ్ఞానమును ఎవరూ తొలగించలేరు. దానిని తొలగించుకోవటానికి నీఅంతట నీవు ప్రయత్నం చేస్తూఉంటే గురువు అనుగ్రహం వస్తుంది. అప్పుడు అజ్ఞానం నశిస్తుంది. నీ రోగం తగ్గటానికి డాక్టరు ఏవిధంగా సహాయం చేస్తున్నాడో అదేవిధంగా నువ్వు ఆధ్యాత్మికంగా అభివృద్ధి పొందటానికి, నీ మనస్సును స్వాధీనం చేసుకోవటానికి గురువు సహాయం చేస్తాడు. భగవంతుడు నిర్దేశించిన మార్గంలో నడిస్తే నీవు తప్పక గమ్యమును చేరతావు. నీ కృషి లేకపోతే అజ్ఞానంలోనుండి బయటపడలేవు. నీ మనస్సులో ఉన్న దోషములనుండి బయటపడితే మనస్సుయొక్క చాపల్యం తగ్గిపోతుంది. అప్పుడు మనస్సుకు పవిత్రత, ఏకాగ్రత చేకూరుతుంది. ఎప్పుడైతే మనస్సుకు ఏకాగ్రత చేకూరిందో అప్పుడు మనస్సు అంతర్ముఖం అవుతుంది. అప్పుడు మనస్సు ఆత్మాకారం చెందుతుంది. అప్పుడు ఆత్మశాంతి, సుఖం వచ్చి నిన్ను వరిస్తాయి.

ఏ శాస్త్రం చెప్పినా, ఏ గురువు చెప్పినా మనస్సును స్వాధీనం చేసుకోమని చెపుతున్నారు ఎందుకు ఈ మనస్సు గురించి ఇంతగా చెపుతున్నారు అని భగవాన్‌ను ఒకరు అడిగారు. నీ కంటికి చేతిని అడ్డుపెడితే ఈ సృష్టి ఎంత పెద్దది అయినా అది నీకు కనబడటం లేదు. చెయ్యి ఎంత చిన్నదయినప్పటికీ కంటికి అడ్డువస్తూ ఉంటే సృష్టి ఏవిధంగా కనబడటంలేదో అదేవిధంగా ఈ మనస్సుకూడా చాలా చిన్నది కాని నీ హృదయంలో ఉన్న విశాలమైన మోక్ష సామ్రాజ్యాన్ని అందుకోకుండా అడ్డువస్తోంది. అందుచేత మనస్సును తొలగించుకోమని శాస్త్రములు చెపుతున్నాయి అన్నారు భగవాన్. మనస్సు నశిస్తేగాని నీకు ఆత్మజ్ఞానము కలుగదు. ఆత్మజ్ఞానము కలిగితేగాని నీకు శాంతి లేదు. నీ మనస్సుకు control లేనపుడు comfort రాదు. నీ మనస్సుకు కంట్రోలు లేనపుడు comfortను ఎందుకు ఆశిస్తావు, ఆశించినా రాదు అంటున్నారు ఆచార్యులవారు. జీవుడు అంటూ ఒకడు ఉంటే సాధన, భక్తి, ధ్యానము ఇవి అన్నీ ఉంటాయి. జీవలక్షణాలు లేనివాడికి సాధనతో పనిలేదు. జీవుడు అనేవాడు ఉన్నాడని నీవు అనుకొంటున్నావు. దేహగతమైన నేను

ఉంది కాబట్టి నిన్ను ధ్యానం, విచారణ చేయమన్నారు. ఈ బోధ అంతా జీవుడికే. అసలు జీవుడే లేనపుడు బోధతోటి, సాధనతోటి పనిలేదు.

నీలోపల ఉన్నదే బయట కనబడుతోంది. నీలోపల లేకపోతే బయట ఏమీ కనబడదు. నీకు లోపల సంకల్పము వచ్చిన తరువాత బయట దృశ్యం కనబడుతోందిగాని లోపల సంకల్పం లేకపోతే బయట దృశ్యంలేదు. ఈ రూపం లేకపోతే, నామం లేకపోతే నువ్వు లేవని అనుకొంటున్నావు. నీ దేహం ఉన్నప్పుడు, లోకం ఉన్నప్పుడు నీవు ఉన్నావు. ఈ దేహం లేనప్పుడు, లోకం లేనప్పుడుకూడా నీవు ఉంటావు. ఎప్పుడూ ఉండటమే నీపని. దేహం వచ్చినప్పుడు లోకం కనబడుతుంది. దేహం లేనపుడు లోకం కనబడదు. రూపం, నామం ఉన్నప్పుడు, లేనప్పుడుకూడా నీఉనికికి భంగంలేదు. సృష్టిఅంటే నామం, రూపం. రూపం, నామం లేనప్పుడుకూడా నీవు ఉంటావు. నామ రూపములు లేనప్పుడుకూడా నువ్వు ఉన్నస్థితి నీకు అర్థమయితే ఈ అజ్ఞానంలోనుండి బయటపడతావు. రూపబుద్ధి, నామబుద్ధి దాటితే ఉన్నవస్తువు తానుగా నీకు వ్యక్తమవుతుంది. ఈ విషయాలన్నీ నీవుగ్రహించాలంటే నీ మనస్సు స్వాధీనంలోనికి రావాలి. భగవదనుభవం పొందాలి అనే స్థిరమైన సంకల్పం ఉంటే ఈ శరీరంలో ఉండగానే దానిని పొందవచ్చు.

దేవుడు ఎవడో నీకు తెలియకపోయినా జీవుడు గురించి తెలుస్తోందికదా. తెలియని విషయాన్ని వదిలివేయండి. నీకు తెలిసిన మనస్సును, జీవుడిని నువ్వు ఎవరు అని ప్రశ్నించండి. ప్రశ్నిస్తే మనస్సు దాని మూలంలోనికి వెళుతుంది. మనోమూలంలోనే నీవు వెతికే దేవుడు ఉన్నాడు. కీలకంఅంతా ఇక్కడే ఉంది. వైరాగ్యబలంతోటి నీ మనోమూలంలోనికి దిగితే అక్కడవున్న దేవుడు నీకు తెలుస్తాడు. ఒకవ్యక్తిమీదగాని, వస్తువుమీదగాని మమకారం ఉంటే మనస్సు బాహ్యముఖానికి వస్తుంది. మనిషి బంధంవలననే పాపం చేస్తాడు. ఒకసారి రామకృష్ణుడు దగ్గరకు ఇతర మతస్థులు కొందరువచ్చి మనుషులు అందరూ పాపులే అని పాపంగురించి చెపుతున్నారు. అప్పుడు రామకృష్ణుడు వారితో మీపాపం గొడవ నేను వినలేకపోతున్నాను. పాపం గొడవ వదిలివేయండి. ఒకవేళ మీరు నిజంగా పాపులు అయితే భగవంతుని నామమును స్మరించటంవలన ఆ పాపాలు అన్నీ కాలి బూడిద అవుతాయి. పాపాన్ని కాల్చి బూడిద చేసేశక్తి లేకపోతే భక్తి ఎందుకు అన్నారు. నీలోపల బలహీనతలు, దోషాలు ఉన్నప్పుడు దేవుని నామం స్మరించటంవలన ఆ బలహీనతలు, దోషాలు బయటకు వచ్చి కాల్చబడతాయి. దేవుని నామానికి నీ పాపాన్ని తొలగించే శక్తి లేకపోతే దేవుని నామంవలన ప్రయోజనం ఏమిటి అన్నాడు రామకృష్ణుడు. ఆ ప్రక్కనే కూర్చొనిఉన్న వివేకానందుని చూపిస్తూ (అప్పటికి వివేకానందుడు విద్యార్థిగా ఉన్నాడు) వీడు చాలా చురుకైనవాడు, సూక్ష్మబుద్ధికలవాడు. వీడికి land అక్కరలేదు, lady అక్కరలేదు, money అక్కరలేదు అన్నాడు. Land అక్కరలేనివాడికి, lady అక్కరలేనివాడికి, money అక్కరలేనివాడికి బంధం ఏమి ఉంటుంది. బంధం ఉండదు. బంధం ఉన్నవాడు పాపం చేస్తాడు. బంధం లేనివాడికి పాపం చేయవలసిన పనిలేదు.

అహంకారము అనేది పెద్దసర్పం. దానికి రజోగుణం, తమోగుణం, సత్వగుణం మూడుతలలు. రజోగుణం ఉన్నవాడికి దురాశ ఉంటుంది. నోరు సూదిబెజ్జం అంత, కాని ఈ సృష్టినంతా మింగేయాలని ఉంటుంది. మానవుడిలో ఎన్ని దోషాలు ఉన్నా, దుర్గుణాలు ఉన్నావీటికి తల్లి ఆశ. మనలో అనేక రకాల కోరికలు ఉన్నాయి. ఈ కోరికలు అన్నీ ఆశలోనుండి వస్తున్నాయి. ఆశ లేకుండా కోరికరాదు. ఆశరజోగుణంలోనుండి వస్తోంది. ఆశను ఎవరూ సంతృప్తిపరచలేరు. ఆశను తృప్తిపరిస్తే అది పెరుగుతూ ఉంటుంది. ఆశను కంట్రోలు చేసుకొన్నవాడు జ్ఞాని అవుతాడు. తమోగుణం ఉన్నవాడు సోమరితనంగా ఉంటాడు. పనికి దూరంగా ఉంటాడు. వాడికి స్వయంకృషి ఉండదు. ఇతరులమీద ఆధారపడి ఉంటాడు. తమోగుణం ఉన్నవాడికి దేవుని గొడవ ఉండదు. తిండి, నిద్రకోరుకొంటూ ఉంటాడు. ఇవి రెండూ తప్ప ఏ గొడవ ఉండదు. సత్వగుణం ఉన్నవాడికి సుఖపడాలనే కాంక్ష ఉంటుంది. సత్వగుణం జ్ఞానం దగరకు వెళ్ళేదారిని చూపిస్తుంది. వైరాగ్యబలంతో నీవు ఎలాగయినా ఈ అహంకారము అనే సర్పాన్ని బయటకు గెంటివేయాలి.

చావులు, పుట్టుకలు, ఇష్టాలు, అయిష్టాలు, బాధలు, సంతోషం, దుఃఖం ఇవి అన్నీకూడా అహంకారముతో తాదాప్యంవలన వస్తున్నాయి. నీలోపల ఉన్న సత్యవస్తువుతో తాదాప్యం చెందకుండా నీ అహంకారముతో తాదాప్యం చెందటంవలన ఇన్ని చిక్కులు, ఇన్ని అనర్థాలు వస్తున్నాయి అని నీకు తెలియటంలేదు. అన్ని చిక్కులకు అహంకారమే కారణంఅని ఎప్పుడు గ్రహిస్తారు. మీమేదస్సును ఉపయోగించకపోతే ఇది మీరు గ్రహించగలరా అంటున్నారు ఆచార్యులవారు. మీకు తెలివి ఉంది. దానిని ఉపయోగించుకోండి. మీరు ఎవరో మీరు తెలుసుకోవటానికి మీ తెలివిని ఉపయోగించకపోతే ఆ తెలివిని ఏమి చేసుకొంటారు. మీకు ఎంతైతే తెలివి ఉందో దానిని ఉపయోగించుకోండి. రవ్వంత ముల్లంత ఆలోచించండి అహంకారముతో తాదాప్యం వలన ఇన్ని చిక్కులు వస్తున్నాయి అని మీకు తెలుస్తుంది అంటున్నారు ఆచార్యులవారు.

నీ హృదయంలో ఒకనిజం ఉంది. నీకు తెలుసున్నా ఉంది, నీకు తెలియకపోయినా ఉంది. దానిని అహంకారం కప్పేస్తోంది. అందువలన దానిని తొలగించుకోమని అడుగుతున్నాను. అవసరమైతే బలవంతంగా అయినా అహంకారబుద్దిని తొలగించుకోమని ప్రార్థిస్తున్నాను అంటున్నారు ఆచార్యులవారు. మీ ఆకారాలు, మనస్సులో వచ్చే వికారాలు వేరుగా ఉండవచ్చుగాని అందరిలోపల ఉన్న ప్రభువు ఒక్కడే. నీ దేహంతోగాని, నీ వికారాలతోగాని అణుమాత్రంకూడా సంబంధం లేకుండా నీ హృదయంయొక్క లోతులలో ఆయన స్వతంత్రముగా ఉన్నాడు. నీ హృదయాకాశంలో ఉన్న ఆ స్వామిని ఏవిద్యద్వారా తెలుసుకొంటావో దానిని ఆత్మవిద్య అంటారు. నీ కంట్రోలర్ నీ హృదయంలోనే ఉన్నాడు. మానవుడు తన్ను తాను మోసం చేసుకోవచ్చు, ఇతరులను మోసం చేయవచ్చు, బయట ఉన్నదేవుని మోసం చేయవచ్చుగాని నీ హృదయంలో ఉన్న దేవుని మోసంచేసే అవకాశం లేదు.

భగవాన్ చెప్పిన ఈ ఒక్కవాక్యం జ్ఞాపకం ఉంచుకోండి. మీ ముక్కులో గాలి తిరుగుతున్నంతకాలం జ్ఞాపకం ఉంచుకోవలసిన వాక్యం ఇది. నేనుకూడా చెప్పాలని చెప్పటంలేదు. చెప్పకుండా ఉండలేక చెపుతున్నాను. మనలో ఎంతకాలం అయితే అహంకారం ఉందో అంతకాలం మనం మనంగా ఉండలేము. మనం మనంగా ఉండలేము కాబట్టి జన్మలు వెంటాడుతున్నాయి, దుఃఖము వెంటాడుతోంది, ఆకర్షణలకు గురి అవుతున్నాము. మనం మనంగా ఉంటే దుఃఖం ఆరిపోతుంది. నిప్పుమీద నీరుపోస్తే ఆ నిప్పు ఎంత వేగంగా ఆరిపోతుందో అలాగ మనలో ఎంత దుఃఖం ఉన్నా మనం మనంగా ఉండగలిగితే ఆ దుఃఖం అంతా ఆరిపోతుంది. అహంకారముతో తాదాప్యం పొందుతున్నంతకాలం ఈ జన్మలోనే కాదు రాబోయే జన్మలోకూడా మనం మనంగా ఉండలేము. ఎంతదూరం చెప్పాలో అంతదూరం చెపుతున్నారు, మనలను వివేకవంతులను చేయటంకోసం భగవాన్ చెపుతున్నారు.

ఇతరులు ఎవరైనా వారి శత్రువులుగా మిమ్మల్ని అనుకొంటే అనుకోనివ్వండి. మీరుమాత్రం ఎవరినీ వారు నా శత్రువు అని అనుకోవద్దు ఎందుచేతనంటే దేహం చనిపోయిన తరువాతకూడా ఆ శత్రువుకు సంబంధించిన వాసనలు నీకూడా వచ్చేస్తాయి, నీ ఆధ్యాత్మిక అభివృద్ధి ఆగిపోతుంది అంటున్నారు ఆచార్యులవారు. ఆత్మను తెలుసుకోవాలి, హృదయంలో ఉన్న శాంతిని పొందాలి అని అందరు అనుకొంటున్నారు. శంకరాచార్యులు, రమణమహర్షిలాగ మనం అయిపోవాలి, ఇంక ఆలశ్యం చేయకూడదు ఈ జన్మలోనే అయిపోవాలి అని మీ అందరికి కంగారుగా ఉంది. మీరు అనుకొంటున్నారు బాగానే ఉంది. మీరు అలా అనుకొని, అలా అవ్వటానికి ప్రయత్నం చేస్తూఉంటే మీకంఠంలో ముల్లుగుచ్చుకుంటే ముద్ద దిగటానికి ఆ ముల్లు ఏవిధంగా అడ్డువస్తుందో అలాగ ఈ అహంకారం మీ అభివృద్ధికి అడ్డువస్తోంది అని ఏ జన్మలో తెలుసుకొంటారు అని ఆచార్యులవారు అడుగుతున్నారు. నీ కంఠంలో గుచ్చుకొన్న ముల్లును డాక్టరు తీసివేస్తాడు, హృదయంయొక్క లోతులలోనికి వెళ్ళకుండా అడ్డువచ్చే ఈ అహంకారము అనే ముల్లును ఎవరు తీస్తారు. నీ అంతట నీవు తీసుకోవటానికి ప్రయత్నం చేయాలి. నీమాటద్వారా, చేతద్వారా అహంకారముఅనే ముల్లును తీసుకోవటానికి ప్రయత్నం చేస్తే దేవుని అనుగ్రహం వేగంగా వస్తుంది. నీ సాధన నిజం అయితే

గురువు దగ్గరకు నీవు వెళ్ళనక్కరలేదు గురువే వచ్చి నీ తలుపు తడతాడు అన్నాడు రామకృష్ణుడు. నీ హృదయంలో ఉన్న తపన చూస్తాడు. నీ శారీరక నటన చూడడు. నీ వివేకంతోటి, సాధనాబలంతోటి ఈములు తీసుకోవాలిగాని కత్తితో తీసుకొనేది కాదు, డాక్టర్లు తీసేది కాదు. నీ విచక్షణాజ్ఞానంఅనే పనిముట్టును లోపలకు పంపి ఈ ముల్లును తీయాలి. ఈ అహంకారం అనేముల్లును తీసివేస్తే నీవు హృదయాకాశంలో ప్రవేశిస్తావు. అప్పుడు లోపలఉన్న ఆనందాన్ని శాంతిని అంతులేకుండా అనుభవించవచ్చును. అనుభవించే కొలది అది పెరుగుతుందిగాని తరగదు. సంసారమునకు సంబంధించిన కష్టాలు, సుఖాలు వస్తూ ఉంటాయి. వాటిమధ్య సాధనచేసి అసలు వస్తువును తెలుసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. నీకు దుఃఖం వచ్చినా, గర్వం వచ్చినా, భోగం వచ్చినా ఇది నిత్యంకాదు అనుకో. కాలప్రవాహంలో అన్నీ కొట్టుకొనిపోతాయి.

హృదయంలో దేవుడు లేడు అనే మనుషులగురించి వివేకానంద ఒకమాట చెప్పాడు. కళ్ళుమూసుకొని సూర్యుడు లేడు అవటం ఎటువంటిదో లోపల అహంకారబుద్ధిని పెట్టుకొని దేవుడు లేడు అని చెప్పటం అటువంటిదే అన్నాడు. కళ్ళు తెరిచిచూడు సూర్యుడు ఉన్నాడో లేడో నీకు తెలుస్తుంది. అలాగే నీ అహంకారబుద్ధిని తొలగించుకొని చూడు నీ హృదయంలో దేవుడు ఉన్నాడో లేడో తెలుస్తుంది. జీవలక్షణాలను పోగొట్టుకొనిచూడు నీ హృదయంలోఉన్న దేవుడు నీకు కనబడతాడు. ఇప్పుడు జీవుడు ఏవిధంగా నీకు ప్రత్యక్షంగా అనుభవంలో ఉన్నాడో జీవలక్షణాలు పోగొట్టుకొన్న రోజున లోపల ఉన్నస్వామిని అలాగ అనుభవించవచ్చు. ఇంట్లో కోటిరూపాయలు ఉన్నాయి అనుకో, ఆ డబ్బును వాడుకోవటానికి అవకాశం లేదు అనుకో ఇంక ఆడబ్బు ఎందుకు, అది నిన్ను ఏమి సుఖపెడుతుంది. అలాగే నీ హృదయంలో దేవుడు ఉంటేమటుకు ఏముంది వాడు నీకు అనుభవంలో లేనప్పుడు. నీకు అనుభవంలోనికి వచ్చినపుడు సుఖం, శాంతి తెలుస్తుంది. ఇప్పుడు నీకు జీవలక్షణాలు ఎలా తెలుస్తున్నాయో అలాగ నీ లోపల ఉన్న ఈశ్వరుడు నీకు అనుభవంలోనికి రావాలి. అది ప్రత్యక్షానుభవం.

అహంకారం ఒకోసారి అణిగి ఉండవచ్చు. పడిపోయింది అని నీవు అనుకోవచ్చు. పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు అహంకారం అణిగి ఉండవచ్చు. దానికి అనుకూలమైన పరిస్థితులు వచ్చినపుడు మీకు తెలియకుండా అతివేగంగా విజృంభిస్తుంది. అహంకారం పూర్తిగా వేరుతోసహా బూడిద అయితే అది పోయింది అనుకోవాలిగాని ఏమాత్రం శేషం ఉన్నా అది విజృంభించే అవకాశం ఉంది. అహంకారం మరల విజృంభించింది అనుకోండి ఆకారాలు, వికారాలు, ఆకర్షణలు, చాపల్యం అన్నీ వచ్చేస్తాయి. అహంకారంపోయే టైములోకూడా ఆక్సిజను పోసుకొని మరల విజృంభిస్తుంది. అందువలన బహుజాగ్రత్తగా ఉండండి. అజాగ్రత్త పనికి రాదు. మీదేహ యాత్రకు సంబంధించిన పనులు శ్రద్ధగా చేసుకోండి. దేహపోషణకోసం ఏపని చేస్తున్నప్పటికీ ఈ శరీరం శవం అవ్వకముందే హృదయంలో ఉన్న బ్రహ్మంను పొందాలి అనే కాంక్షను వదిలిపెట్టవద్దు. అహంకార ప్రేరణగా నీవు మాట్లాడవద్దు. అహంకార ప్రేరణగా నీవు పనిచేయవద్దు. అహంకార ప్రేరణగా నీవు ఆలోచించవద్దు. బయటవారికి తెలియకపోయినా మనం అహంకారంకోసం చేస్తున్నామో, ఈశ్వరుని ప్రీతికోసం చేస్తున్నామో అని మనంతట మనకు తెలుస్తూ ఉంటుంది. అహంకారముయొక్క చమత్కారములనుండి, కుప్పిగంతులనుండి బయటపడినప్పుడుకదా నీవు ఆత్మసామ్రాజ్యానికి అధిపతివి అయ్యేది. అందువలన అహంకారమునకు సంబంధించిన విషయములనుండి మీరు బయటపడాలి. బ్రహ్మానుభవం పొందాలి అనే బలీయమైన కోరిక తప్పించి మిగతా చిల్లర గొడవలోనికి వెళ్ళవద్దు. మిగిలినవన్నీ స్వప్నసమానమే. ఒకవేళ నీకు కోరిక వస్తే బ్రహ్మమును పొందాలి అనే కోరిక పెట్టుకో. దానికోసం ప్రయత్నంచెయ్యి. దానికోసం జీవించు, దానికోసం మరణించు. ఇప్పుడే ఇక్కడే సాధనచేసి ఆ వస్తువును పొందండి. తరించండి. శాంతి సామ్రాజ్యానికి అధిపతి అవ్వండి. భగవంతుని తెలుసుకోవాలి అనే స్థిరమైన సంకల్పమును విడిచిపెట్టవద్దు. జాగ్రత్తగా పోషించుకోండి అని ఆచార్యులవారు చెపుతున్నారు.